RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ సోమవారం 23.03.2026 సంపుటి : 03 సంచిక : 107 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Monday 23.03.2026 Volume: 03 Issue 107 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## ప్రధాని మోదీ అరుదైన రికార్డు

### సుదీర్ఘకాలం ప్రభుత్వాధిపతిగా..



ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన రికార్డు నెలకొల్పారు. ఎలాంటి విరామమూ లేకుండా 8,931 రోజుల పాటు సుదీర్ఘకాలం ప్రభుత్వాధి పతిగా (గుజరాత్ సీఎం పదవీ కాలం సహా) పని చేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటివరకు ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ (8,930 రోజులు) పేరిట ఉంది. తాజాగా ఆయన రికార్డును ప్రధాని మోదీ అధిగమించారు. పవన్ కుమార్ 8,930 రోజుల పాటు సిక్కిం సీఎం హో దాలో ఉన్నారు. నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాలతో అన్ని రోజుల పదవీకాలాన్ని పూర్తి చేశారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో ఉన్నారు. 2014 నుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా ఉన్నారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యం

**రైతు భరోసా నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. తొలివిడత 70 లక్షల మంది ఖాతాలకు రైతుభరోసా నిధులు రిలీజ్ చేశారు. ఎకరం వరకు ఉన్న రైతులకు రూ.3,600 కోట్లు విడుదల చేశారు. ఆదివారం కావడంతో రైతుల ఖాతాల్లోకి సోమవారం నిధులు జమకానున్నాయి. మరో 20 రోజుల చొప్పున మిగతా రూ.5,400 కోట్లు జమకానున్నాయి. మరో 2 విడతల్లో రూ.2,700 కోట్లు చొప్పున రైతు భరోసా నిధులు జమకానున్నాయి. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు.**

## రైతు భరోసా నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- పంటలకు మద్దతు ధరతో సహా రూ.500 బోనస్ ఇస్తున్నాం
- ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు అమలు చేస్తున్నాం
- 20 నెలల్లో రైతుల కోసమే రూ.లక్షా 40 వేల కోట్లు ఖర్చు
- రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నాం
- వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి
- 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొంటాం
- రైతుల ఆదాయం పెరగాలంటే వరి ఒక్కటే మార్గం కాదు
- పంటల మార్పిడితో రైతులకు మంచి ధర వచ్చేలా భరోసా
- మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి
- పామాయిల్ సాగుతో రైతుల ఆదాయం పెరుగుతుంది
- ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెంచుకోవాలి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం
- అన్నదాతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



**జనోదయ : సిద్దిపేట, మార్చి22 :**

రైతు భరోసా నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. తొలివిడత 70 లక్షల మంది ఖాతాలకు రైతుభరోసా నిధులు రిలీజ్ చేశారు. ఎకరం వరకు ఉన్న రైతులకు రూ.3,600 కోట్లు విడుదల చేశారు. ఆదివారం కావడంతో రైతుల ఖాతాల్లోకి సోమవారం నిధులు జమకానున్నాయి. మరో 20 రోజుల చొప్పున మిగతా రూ.5,400 కోట్లు జమకానున్నాయి. మరో 2 విడతల్లో రూ.2,700 కోట్లు చొప్పున రైతు భరోసా నిధులు జమకానున్నాయి. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతం కంటే రైతు భరోసా నిధులు పెంచామని తెలిపారు. పంటలకు మద్దతు ధరతో సహా రూ.500 బోనస్ ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతినెలా రైతుల సంక్షేమం కోసం రూ.5,500 కోట్ల వ్యయం అవుతుందని చెప్పుకొచ్చారు. 20 నెలల్లో రైతుల కోసమే రూ.లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.ప్రతి పంట సాగులో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.750 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని ప్రస్తావించారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొంటామని తెలిపారు. కొడంగల్‌లోనూ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని వెల్లడించారు. రైతుల ఆదాయం పెరగాలంటే వరి ఒక్కటే మార్గం కాదన్నారు. రైతులు పంటల మార్పిడికి కృషి చేయాలని సూచించారు. పంటల మార్పిడికి రైతులను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. పంటల మార్పిడితో రైతులకు మంచి ధర వచ్చేలా చూస్తామని భరోసా కల్పించారు. మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ సాగుపై అన్నదాతలు దృష్టి పెట్టాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు.ప్రతి పంచాయతీ అంకాపూర్‌లా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు అదానీ, అంబానీ వంటివారు మాత్రమే సౌర విద్యుత్ వ్యాపారం చేసేవారని అన్నారు. తమ ప్రభుత్వం మహిళలతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించిందని ప్రస్తావించారు. మహిళల పేరుతోనే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. పిల్లలను ప్రైవేట్ బడుల్లో చదివించాలనే ఆలోచన చేయొద్దని అన్నారు. ప్రభుత్వ బడుల్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని ఉద్ఘాటించారు. విద్యార్థులకు పాలు, రాగి, జావ, పౌష్టికాహారం అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో

# అంతరాయం లేకుండా చూడాలి

**ప్రధాని ఉన్నత స్థాయి సమావేశం**

**ఢిల్లీ:**పశ్చిమాసియా యుద్ధం తీవ్రతతో దేశంలో నెలకొన్న గ్యాస్ సంక్షోభం, ముడి చమురు కొరత వంటి అంశాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. యుద్ధం కారణంగా భారత్‌లో గ్యాస్ నిల్వలు, విద్యుత్, ఎరువులు సరిపోను ఉన్నాయా? లేదా? అనే అంశంపై కేంద్ర మంత్రులతో ఆదివారం ప్రధాని ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరాలైన గ్యాస్, విద్యుత్, ఎరువుల పంపిణీలో అంతరాయం లేకుండా చూడాలని మోడీ సూచించారు.మూడు వారాలకు పైగా జరుగుతున్న పశ్చిమాసియా యుద్ధం ప్రభావంతో భారత్ ఇంధన కొరత, గ్యాస్ సరఫరాపై అనిశ్చితి నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దేశ ప్రజల్లోని భయాలను తొలగించాలనే ఉద్దేశంతో ప్రధానంగా ఇంధన భద్రత,



సరిపోను నిల్వలు ఉండేలా చూసు కోవడం, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించడం వంటి వాటిపై దృష్టి సారించారు.

# జైళ్ల సామర్థ్యం ఎంత?

**ఖైదీలు ఎంత మంది?**

**దేశంలో జైళ్ల పరిస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన**



**న్యూఢిల్లీ, మార్చి 22 :** దేశవ్యాప్తంగా కిక్కిరిసిన జైళ్ల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్ల సామర్థ్యం ఎంత?, ఖైదీలు ఎంతమంది ఉన్నారు? జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదు? అంటూ ప్రశ్నించింది. జైళ్లు సంస్కరణకు నిలయాలుగా ఉండాలే తప్ప నరకకూపాలుగా మారకూడదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారించిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రంతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 1 వరకూ జైళ్లలోని ఖైదీల సంఖ్య, జైళ్ల సామర్థ్యం, రద్దీని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలపై మే 18లోగా సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే, జైళ్లలో మహిళా ఖైదీలతోపాటు ఉంటున్న చిన్నారుల దుస్థితిపై ధర్మాసనం కలత చెందింది. ఆ చిన్నారులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వైద్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది.

# నేను ఇక కాంగ్రెస్‌లో ఉండలేను..

- **25వ తేదీన తన రాజకీయ భవిష్యత్తుపైన నిర్ణయం**
- **జీవన్‌రెడ్డి సంచలన ప్రకటన**

**జనోదయ : జగిత్యాల, మార్చి22 :** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి అత్యంత సీనియర్, గౌరవప్రదమైన నాయకుడు. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌కి వెన్నుముకగా ఉన్న ఆయన, ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారనే వార్త రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల జరిగిన పరిణామాలతో జీవన్ రెడ్డి పార్టీ హైకమాండ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కాంగ్రెస్‌లో నాకు గౌరవం లేదు.. ఇక ఈ క్షోభను భరించలేను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. ఈ నెల 25వ తేదీన తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయం ఉంటుందని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాలుగా తనతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వాలని అన్నారు. జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో 25న తన ముఖ్య నేతలతో సమావేశమై ఓ నిర్ణయం తీసుకుంటానని చెప్పుకొచ్చారు. పార్టీలో కొనసాగలేనని.. ఈ క్షోభ భరించలేనని అన్నారు. పార్టీలో తనకు గౌరవం లేదని తెలిపారు. తనకు అన్యాయం చేసిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఒకరని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి వల్ల తన గౌరవానికి భంగం కలిగిందన్నారు. తనకు రేవంత్ అంటే గౌరవం ఉన్నా.. తన సమస్యకు పరిష్కారం ఆయన దగ్గర కూడా లేదని తెలిపారు. పదిమంది ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టగలరా..? అని ప్రశ్నించారు. మేడిగడ్డను రిపేర్ చేసే బాధ్యత లేదా..? అని నిలదీశారు. రైతాంగం సాగునీటికి ఇబ్బంది పడుతోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడినా, ప్రస్తుతం పార్టీలో తనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి (ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి) ఎమ్మెల్యే సంజయ్, ఇతర నేతల చేరికలు, వారికి పార్టీలో ప్రాధాన్యం పెరగడం జీవన్ రెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తన రాజకీయ భవిష్యత్తును తేల్చుకోవడానికి ఈ నెల 25వ తేదీన జగిత్యాలలోని బండారు గార్డెన్‌లో తన అనుచరులు, ముఖ్య నేతలతో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు కార్యకర్తల సూచనల మేరకు



తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. 'నాలుగు దశాబ్దాలుగా నాతో నడిచిన కార్యకర్తలు, సన్నిహితులు సూచనలు ఇవ్వండి. మీ అభిప్రాయం మేరకే నా భవిష్యత్ నిర్ణయం ఉంటుంది' అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జీవన్ రెడ్డి వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేత పార్టీని వీడితే, అది కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బనేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సీనియర్లను కాపాడుకోలేకపోతున్నారనే విమర్శలు కాంగ్రెస్ హైకమాండ్‌పై వచ్చే అవకాశం ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ఆయన స్వతంత్రంగా ఉంటారా లేక మరేదైనా పార్టీలో చేరుతారా అన్నది ఉత్కంఠగా మారింది.

# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

- ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనోదయ, జనగాం, మార్చి 22:**

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడోద్దని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హెచ్చరించారు. జిల్లాలోని తరిగొప్పుల మండల పరిధిలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.నిత్యావసర సరుకులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని అన్నారు.విద్యార్థులను ఉద్దేశించి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని "ఆల్ ది బెస్ట్" తెలిపారు. పరిశీలనలో ఇంగ్లీష్ సీఆర్టి పాల్గొన్నారు.

### పస్రా అటవీ శాఖ కార్యాలయంలో

## ప్రపంచ అటవీ దినోత్సవం




**జనోదయ: ములుగు**

ఆదివారం గోవిందరావు పేట మండలం పస్రా అటవీ శాఖ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన అడవుల సంరక్షణ – ఆవశ్యకత అవగాహన కార్యక్రమ ర్యాలీలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణిలతో కలిసి పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు
- ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

**జనోదయ, వర్ధన్నపేట, మార్చి 22:**

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గ్రామ పంచాయతీ పరిధిలో గల దేవిలాల్ తండాకి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు లావుడ్య మంగమ్మ – రాములు ఇంటి నిర్మాణం కోసం ముగ్గుపోసే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏం మాట్లాడుతూ..నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. ఇండ్లు మంజూరైన ప్రతి ఒకరు ఇండ్లు కట్టుకొని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచనలు చేశారు.లబ్ధిదారులకు విడత లవారీగా రూ 5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పర్వతగిరి గ్రామ సర్పంచ్ చిదురు శంకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూసం రామచందర్,



మం డల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### టూరిజం విలేజ్ నిర్మాణ పనులను

## పరిశీలించిన మంత్రి



**జనోదయ : ములుగు**

ఆదివారం ములుగు మండలం ఇంచర్ల గట్టమ్మ వద్ద పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రామప్ప ప్రాంత సుస్థిర పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా నిర్మిస్తున్న టూరిజం విలేజ్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,స్థానిక ఇంచర్ల సర్పంచ్ ముసినేపల్లి కుమార్ గౌడ్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు,జిల్లా నా యకులతో కలిసి పరిశీలించారు.

# దేశభక్తే బీజేపీ జీవధాతువు

- బీజేపీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా, నవ భారత నిర్మాణంలో ఒక కీలక శక్తి
- సైద్ధాంతిక స్పష్టతే బీజేపీ బలం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్





**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**

వరంగల్ జిల్లా ఏనుమాముల బీజేపీ కార్యవర్గం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు బుద్దే శ్రీనివాస్ అధ్యక్షతన పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్'లో పాల్గొన్నారు. పం డిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అం త్యోదయ దృష్టి, సమగ్ర మానవతా భావన, సేవాతత్వం మరియు జాతీయ తాస్ఫూర్తిని కార్యకర్తలకు వివరించడం జరిగింది. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భావనను కార్యరూపంలోకి తీసుకువస్తూ.. సమా జంలోని చిట్ట చివరి వ్యక్తి వరకు సేవా కార్యక్రమాలను చేర్చే దిశగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలి. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శాలను, సిద్ధాంతాలను, సైద్ధాంతిక నిబద్ధతతోనే సంస్థాగత నిర్మాణం, మానవుడిని కేంద్రంగా ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం.సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడానికి చేపట్టిన ప్రతిష్టాత్మక శిక్షణ ఇది. ప్రజాస్వామ్య విలువల స్థాపన, విలువలపై ఆధారపడిన రాజకీయాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతర అధ్యయనంపై వివరించారు.వ్యక్తి నిర్మాణం – సంస్థా నిర్మాణం – దేశ నిర్మాణం" నినాదంతో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఈ కార్యక్రమంలో ప్రశిక్షణ జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, బిజెపి రాష్ట్ర నాయకులు జలగం రంజిత్ రావు, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్ను ఆరోగ్యం, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ రాజు, మరియు మండల, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పేపర్స్ దహనం



**జనోదయ, హనుమకొండ, మార్చి 22:** హనుమకొండలో రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు అన్యాయం జరిగినందుకు నిరసనగా అన్ని బీసీ,ప్రజా సంఘాల నాయకులతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి,బడ్జెట్ పేపర్స్ ను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో టి ఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ , వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ పటేల్ , వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండల సంపత్ పటేల్ , వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మపురి రామారావు పటేల్ , వరంగల్ మహిళా సెల్ అధ్యక్షురాలు మంచాల పద్మ నేత , వరంగల్, హనుమకొండ టి ఆర్ పి నాయకులు పాల్గొన్నారు..

# ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద-**

**జనోదయ, మందమర్రి మార్చి 22:**



ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రం లోని ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. ఆదివారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయల అంచనా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలోని 8, 9 వార్డులలో 13 లక్షల రూపాయలతో సిసి రోడ్ నిర్మించడం జరిగిందని, శ్రీనివాస గార్డెన్ నుండి అమ్మ గార్డెన్ వరకు 1 కోటి 80 లక్షల రూపాయలతో హైమాస్ లైట్ల ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, 30 రోజులలో నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 40 కోట్ల రూపాయలు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలోని ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 51 లక్షల రూపాయల నిధులతో సిసి రహదారులు నిర్మించి విద్యార్థుల ప్రారంభించామన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా 32 కోట్ల రూపాయల వ్యయంతో మున్సిపల్ పరిధిలో రహదారులు, మురుగు కాలువలు, లైటింగ్, త్రాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందని, ఇంటర్నల్ పైప్ లైన్ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపల్ పరిధిలోని డబుల్ ఒక్కొక్క వార్డులో దాదాపు 2 కోట్ల రూపాయల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి, చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలలోని అన్ని వార్డులలో అమృత్ పథకం ద్వారా క్రింద త్రాగునీటిని అందించడం జరుగుతుందని, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చెరువులు, కుంటలు, నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగు తుందన్నారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


## భావితరాల కోసం నీటిని పొదుపు చేద్దాం

**రతన్ సింగ్ ఠాకూర్, శ్రీనివాసరావు**




**జనోదయ, హనుమకొండ, మార్చి 22:**

నీరు జీవకోటికి ప్రాణాధారం అని, నీరు లేనిదే జీవం లేదనీ, ఉన్న నీటిని పొదుపుగా వాడి భవిష్యత్ తరాల కోసం పొదుపు చేయాలని యూత్ ఫర్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోడిమాల శ్రీనివాసరావు, ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాగూర్ అన్నారు. 34వ "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరాన్ని "నీరు, లింగ సమానత్వం," నీరు ప్రవహించే చోట సమానత్వం పెరుగుతుందని , నీరు అందరికీ సమానంగా అందితే సమాజంలో సమానత్వం, ఐక్యత పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు దేవి శ్రీ ప్రసాద్, నీరజ్, రుత్విక్, విష్ణు, రోహిత్ ,అర్జున్ కార్తికేయ,రాజు పాల్గొన్నారు.



## ప్రతీ నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలి

**-మానవాళితో పాటు సకలకోటి జీవరాశులకు, వృక్షాలకు నీరే ప్రాణాధారం**

**-స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు గిరిగాని సుదర్శన్ గౌడ్**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**




ఆదివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఏఎస్ఆర్, ప్రతిభ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గౌడ సంఘం కార్యాలయం ప్రక్కన నివాసం ఉన్నటువంటి మహిళలకు నీటి వాడకం పట్ల అవగాహన కల్పిస్తూ.. రానున్న వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువ ఉంటుందని, తద్వారా భూగర్భజలాలు అడుగంటిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని అన్నారు. భూమి మీద ఉన్న మొత్తం నీటిలో మానవాళికి ఉపయోగపడేది .2.5 శాతం మాత్రమే అని మిగతా 97.5 శాతం ఉపయోగపడని సముద్రపు ఉప్పు నీరే కాబట్టి, ప్రజలు ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పొదుపుగా వాడుకోవాలని, భూగర్భజలాలను కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని డివిజన్ స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గిరిగాని సుదర్శన్ గౌడ్, ఎర్రబోయిన రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ బాధ్యుడు బెజ్జంకి ప్రభాకర్, వెంకటస్వామి, చారి, నాదెం ఉప్పలమ్మ, మాధవి, శ్వేత స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు

**జనోదయం, మంథని:**



సూర్యయ్యపల్లి గ్రామంలో రైతువేదిక నుంచి తేనుగూడెం వరకు, గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పోచమ్మ దేవాలయం వరకు రూ.15 లక్షలతో ఈజీఎస్ నిధుల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ల నాగరాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్ల నాగరాజు, ఆకుల కిరణ్, అరెల్లి కిరణ్ మాట్లాడుతూ గ్రామానికి నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మిగిలిన రోడ్ల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుచిత-వరుణ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బూరుగుపల్లిలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి జీవిత చరిత్ర ప్రవచనం



**అంతరించిపోతున్న కళకు ప్రాణం పోస్తున్న కళాబృందం**

**జనోదయ : గంగాధర మార్చి22:**

గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి జీవిత చరిత్రను బూరుగుపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మం గారి జీవితం, ఆయన చెప్పిన కాలజ్ఞానం, ధర్మ బోధనలు గురించి విస్తృతంగా వివరించారు. కార్యక్రమానికి గ్రామ స్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా కళాకారులు దూలం సత్తయ్య గౌడ్, ఉదారి రాము లు, శ్రీకోటి రాజు, శ్రీకోటి రామ చంద్రం పాల్గొని వీరబ్రహ్మం గారి జీవితం గురించి పాటలు, కథల రూ పంలో వివరించి ప్రేక్షకులను ఆకట్టు కున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతా వరణం నెలకొని కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది.






## మంథనిలో కూరగాయలకు సంచి తెస్తే

# తోటకూర ఫ్రీ

**జనోదయ, మంథని:**

పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతగా మంథనిలో ఓ కూరగాయల వ్యాపారి వినూత్న ప్రచారానికి తెరలేపారు. ఇంటి నుంచి చేతి సంచి (జ్యూట్ లేదా కాటన్ బ్యాగ్) తెచ్చు కున్న వినియోగదారులకు సదరు వ్యాపారి ఒక తోటకూర కట్ట లేదా కొత్తిమీర కట్ట లేదా సొరకాయ లేదా అరకిలో ట మాటాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కూర గాయల వ్యాపారి మాట్లాడుతూ పాలిథిన్ కవర్ల పై యుద్ధం ప్రకటిస్తున్నామని అన్నారు. అలాగే ఫంక్షన్ హాళ్ల దగ్గర ఇతర కార్యక్రమాల వద్ద పాలిథిన్ కవర్లు, డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు వాడవద్దని విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లకు దూరంగా ఉండాలని కోరారు.

# ఎమ్మెల్యే నాయినితో మాకు అన్యాయం

**మాడవీధుల అభివృద్ధికి మేము అడ్డు కాదు**

**చావనైనా చస్తాము.. కానీ కదిలేది లేదు**

**చెరబండరాజు కాలనీవాసులు**

**జనోదయ, హనుమకొండ, మార్చి 22:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన అధికారాన్ని అడ్డు పెట్టుకుని, భద్రకాళి దేవాలయం పక్కన గల చరబండ రాజు కాలనీకి ఎలాంటి సంబంధం లేని, బయట స్థిరపడిన వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కే టాయించడం, ఔట్ సోర్సింగ్ ఉద్యో గాలు కూడా ఇస్తామని ప్రకటించి మాకు అన్యాయం చేస్తున్నాడనీ చరబండ రాజు కాలనీవాసులు ఆవే దన వ్యక్తం చేశారు. ఆదివారం కా లనీవాసులు మీడియాతో మాట్లా డుతూ...మార్పు కావాలని నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి నాయిని రాజేందర్ రెడ్డినీ గెలిపిం చుకున్న ఖర్మానికి మమ్ములను వె న్ను పోటు పొడుస్తున్నాడని ఆగ్ర హం వ్యక్తం చేశారు.

**భయభ్రాంతులకు గురి చేస్తున్న ఎమ్మెల్యే...**

గత 3 నెలల క్రితం కనీసం తాగ డానికి మంచినీళ్లు కూడా లేకుండా చేసినాడని, కరెంట్ కూడా తిసివేస్త ము అని, రాత్రికి రాత్రే బుల్డోజర్ తో మా ఇండ్లు కూడా తొలగిస్తామ ని మమ్ములను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వారు తెలిపా రు. అలాంటి పరిస్థితులలో మేము చట్టాలను నమ్ముకొని, హ్యూమన్ రైట్స్, ఎస్సీ ఎస్టీ కమీషన్ లను సంప్రదిస్తే వెంటనే మాకు తాగడా నికి మంచినీళ్లు విడుదల చేయించా రని తెలిపారు.

**రాజకీయ లబ్ధి కోసమే...**

తన రాజకీయ లబ్ధికోసం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భద్రకాళీ మాడ వీధుల అభివృద్ధి పేరుతో ఇక్కడ 23 ఏళ్లుగా నివసిస్తున్న మ మ్ములను కావాలనే కక్షపూరితంగా అన్యాయం చేస్తున్నాడనీ అన్నారు. మమ్ములను కాదని బయటి వారికి పట్టాలిస్తామని, ఔట్సోర్సింగ్ ఉద్యో గాలు ఇస్తామని, డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ప్రకటించడం సిగ్గు చేటని అన్నారు.



**చావనైనా చస్తాము కానీ, ఇక్కడి నుండి కదిలేదే లేదు...**

ఇదే విషయమై మాకు హై కోర్టు సేటస్కో,హ్యూమన్ రైట్స్ ఆర్డర్స్, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ నోటీస్.. అన్ని రకాల చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా మేము వినతి పత్రాలు ఇచ్చామని.. చట్టాల్ని దిక్క రించి ఇక్కడ నివసిస్తున్న మాకు అన్యాయం చేస్తే చావనైనా చస్తాము కానీ.. ఇక్కడి నుండి కదిలేది లేదని హెచ్చరించారు. సమావేశంలో గన్నా రపు రాజు, బస్కుల కుమార్, రవ ళి, అనీల్, సునీత, కొమురయ్య, ఎవంజలిన, బాబు, భాస్కర్, మొద లైన కాలని వాసులు పాల్గొన్నారు.

# పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్**

**-వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) పేదలకు పెన్నిదని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం పర్వతగిరి మండ లానికి సంబంధించిన 83 మంది లబ్ది దారులకు రూ. 83,09,628 (83 లక్షల 9 వేల 628) విలువ గల కళ్యా ణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పర్వ తగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసి నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయం విచ్చేసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఈ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపే దలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ.. ఆపన్న హస్తం అందిస్తుందని వెల్లడించారు. రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి పథ కంలో భాగంగా నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దే శంతో ఈ పథకం ప్రారంభించ బడిందని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. ముందుకు సాగు తుందని, రాష్ట్రంలో పేదలకు నూతన రేషన్ కార్డు అందజేసి రేషన్ కార్డుదా రులందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఎవరికీ ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మోడల్ హౌస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో



ఎమ్మార్వో వెంకట స్వామి, ఎంపో శేషు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచులు చిదురు శంకర్, మంజుల, గాడిపెల్లి మహేం దర్, నరేష్, కనకయ్య, శ్రీనివాస్, మూడు లక్ పతి, కిషన్ నాయక్, శ్రీనివాస్, గాదుల రమేష్, విజయలక్ష్మీ, డెక్క సునీత, విజయ, ఉపసర్పంచ్ రాజు, దూదల మల్లన్న చైర్మన్ కారింగుల రాము పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలను నయవంచన చేసిన రేవంత్ సర్కార్

### మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్



**జనోదయ : చొప్పదండి మార్చి 22:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్‌పై మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలకు ఉపయోగపడేదిగా కాకుండా, కాంట్రాక్టర్లకు మరియు రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించిన బడ్జెట్‌గా ఉందని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు ఈ బడ్జెట్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, "గుండు సున్నా, గాడిద గుడ్డు" లాంటి బడ్జెట్‌గా లాగా కనబడుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతంలో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉండేవని, సాగు చేసుకోవడానికి నీళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ఆ సమయంలో తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు అధికంగా జరిగాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ఉద్యమం ద్వారా రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ప్రతి బడ్జెట్ భారీగా ఉండేదని, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్ రూపొందించేవారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా అనేక పథకాలు అమలు చేశారని అన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 2026--27 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం రూ. 23,179 కోట్లు మాత్రమే కేటాయించడం రైతుల పట్ల అన్యాయం అని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజులుగా చేయాలనే లక్ష్యంతో భారీగా నిధులు కేటాయిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వెనక్కి నెట్టిందని అన్నారు. రైతు భరోసా విషయంపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆయన విమర్శించారు. ఎకరానికి రూ. 12,000 ఇస్తామని చెప్పినా, బడ్జెట్ కేటాయింపులు చూస్తే రెండు పంటలకు రైతు భరోసా ఇవ్వడం కూడా సాధ్యం కాదని అన్నారు. కౌలు రైతులకు ఇచ్చే డబ్బులు, ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే డబ్బులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వం చెప్పిన హామీలు అమలు చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలను అభివృద్ధి వైపు తీసుకెళ్లేది కాకుండా అప్పుల వైపు తీసుకెళ్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్ దాదాపు రూ. 3.27 లక్షల కోట్లు పెట్టారని, అందులో ఎక్కువ భాగం అప్పులేనని ప్రభుత్వం చెబుతోందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో తీసుకున్న అప్పులపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రెండున్నర సంవత్సరాల్లోనే భారీగా అప్పులు చేస్తున్నారని విమర్శించారు. ఇంకా మిగిలిన కాలంలో తెలంగాణ ప్రజలపై మరింత అప్పు భారం పడే ప్రమాదం ఉందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసినా అభివృద్ధి కోసం చేశారని ఆయన అన్నారు. కొత్త సచివాలయం, కాళేశ్వరం ప్రాజెక్ట్, అంబేద్కర్ విగ్రహం, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు, మెడికల్ కాలేజీలు, రోడ్లు, బ్రిడ్జిలు, కాల్వలు, తాగునీటి ప్రాజెక్టులు వంటి అనేక అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు వంటి అన్ని రంగాల్లో తెలంగాణను ముందుకు తీసుకెళ్లిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా పెద్ద అభివృద్ధి పనులు ఏవీ చేయడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలోనే దాదాపు రూ. 2000 కోట్లు ఖర్చు చేసి నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేశామని తెలిపారు. మంగపేట మరియు నారాయణపూర్ ప్రాంతాల్లో నిర్వాసితులకు పరిహారం కూడా ఇచ్చామని అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. త్వరలోనే నారాయణపూర్ నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేకంగా ప్రెస్ మీట్ నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కాల్వల పనులు పూర్తికాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. కాల్వలు పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రకటనలు మాత్రమే చేస్తున్నారని, పనులు మాత్రం జరగడం లేదన్నారు. ప్రస్తుతం కొందరు నాయకులు అభివృద్ధి పనులు చేయకుండా అపర భగీరథుడు అని ఫ్లెక్సీలు, రీల్స్ చేసుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పని చేసి చెప్పుకుంటే తప్పు లేదని, కానీ పని చేయకుండా ప్రచారం చేసుకోవడం సరైంది కాదని అన్నారు. ప్రజలు అభివృద్ధి కోసం ఓటు వేస్తారని, ప్రచారం కోసం కాదు అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఇంకా రెండున్నర సంవత్సరాల పాలన మిగిలి ఉందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. ప్రజలు గెలిపించినందుకు వారికి న్యాయం చేసే విధంగా పాలన సాగించాలన్నారు.

## హైదరాబాద్‌కి దీటుగా వరంగల్

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**జనోదయ, హనుమకొండ, మార్చి 22:** వరంగల్ నగరంను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ కొనసాగుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 30, 59వ డివిజన్లలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లకు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సీసీ రోడ్లు లేని కాలనీలను పూర్తిగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాక్స్‌కేర్ హాస్పిటల్ అధ్వర్యంలో కోటపల్లిలో ఆరోగ్య శిబిరం



**చెన్నూరు ఆర్సీ : జనోదయ**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలో మ్యాక్స్ కేర్ మల్టీస్పెషలిటీ మరియు రాఘవేంద్ర పిల్లల మెగా హెల్త్ క్యాంపును కోటపల్లి సీఐ కృష్ణ ,ఎస్ఐ రాజశేఖర్ , కోటపల్లి సర్పంచ్ ఆలూరి సంపత్‌లు ప్రారంభించారు. అనంతరం మ్యాక్స్ కేర్ హాస్పిటల్ అండ్ రాఘవేంద్ర పిల్లల హాస్పిటల్ డాక్టర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ కోటపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, కోటపల్లి యూత్ పానగంటి మల్లికార్జున్ ,కన్న సంపత్ ,చిగురాల ప్రేం సాయి, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






## నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**జనోదయ : హనుమకొండ :** మానవ మనుగడకు నీరు అనేది ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నేడు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకున్నప్పుడే భావి తరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవని పేర్కొన్నారు. వాటర్ ప్లాంట్ల పై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు



వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# స్కాములు తప్ప స్కీములు లేని బడ్జెట్

**-పథకాలు నిల్లు అప్పులు పుల్లు**
**-రైతుబంధు జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ ఎల్లావుల లలిత యాదవ్**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) మార్చి 22**

రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో స్కాములు తప్ప స్కీములు లేవని రైతుబంధు వరంగల్ జిల్లా మాజీ కో–ఆర్డినేటర్ ఎల్లావుల లలిత యాదవ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని బాలాజీ నగర్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన లలిత యాదవ్ మాట్లాడుతూ.. బడ్జెట్ లో మహాలక్ష్మి పథకానికి రూ.2500/– మాటే లేదని, కౌలు రైతులపై కనికరం చూపలేదని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గత బడ్జెట్ కంటే ఈసారి కోత విధించారని అన్నారు. ఆరు గ్యారంటీలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతుంది. గానీ ఆరు పైసలు కూడా ఖర్చు చేయలేదు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి గాడొల్లగా ఉంది, అందులో పెద్ద మోసం ఉంది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.3.85 లక్షల కోట్లు ఖర్చు చేసి పెద్ద ప్రాజెక్టులు పూర్తి చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులను చూపాలి. బిఆర్ఎస్ హయాంలో వరంగల్ హెల్త్ సిటీ కోసం రూ.1500 కోట్లతో 24 అంతస్తుల భవనం నిర్మించాం.దేవాదుల ప్రాజెక్టుకు రూ15వేల కోట్లు ఖర్చు చేసి పూర్తి చేశాం. కాంగ్రెస్ బడ్జెట్ జీరో బడ్జెట్. అసెంబ్లీలో ప్రాంత సమస్యలు చెప్పేందుకు స్థానిక ఎమ్మెల్యేకు అవకాశం లేక, మంత్రులను అడగాల్సిన పరిస్థితి వచ్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో గతంలో మంజూరు చేసిన రోడ్లకు నిధులు కేటాయించడం లేదు. గతంలో



అసెంబ్లీలో సమస్యలు లేవనెత్తితే సమాధానాలు వచ్చేవి, ఇప్పుడు అలాంటిది లేదు.గతంలో ఒక కాంట్రాక్టర్ పిలిస్తే పదిమంది వచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. రైతుబంధు ఇవ్వకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం తగ్గింది. వాణిజ్య నిధులు కేవలం కాంగ్రెస్ పార్టీ సర్పంచులకే ఇస్తున్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ వీర బిక్షపతి, 3వ డివిజన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, సీనియర్ నాయకులు ముదుసు నరసింహ, గంద్రతి భాస్కర్, పత్రి సుభాష్, పస్తం యాదగిరి, ఎండి సలీం, రాపర్తి శ్రీనివాస్, న్యాతని గోపాల్, అశోక్ చారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్, మ్యూజికల్ గార్డెన్ పనుల్లో వేగం పెంచాలి

**అభివృద్ధి పనుల పరిశీలించిన కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)**



వరంగల్ నగరాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదివారం సిపివో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు లు మరియు సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఇందులో భాగంగా నేడు హంటర్ రోడ్ లోని చారిత్రక వరంగల్ నగరానికి తలమానికంగా నిలుస్తున్న భద్రకాళి బండ్ (బయోడైవర్సిటీ పార్క్) మరియు కాకతీయ మ్యూజికల్ గార్డెన్ లలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం భద్రకాళి బండ్ హంటర్ రోడ్ వైపు చేపడుతున్న రెండో దశ అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి అమ్మవారి ఆలయం చుట్టూ.. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాడ వీధుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, మధ్యలో 9 నవగ్రహ దీవులను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు తెలంగాణలోనే తొలిసారిగా భద్రకాళి సరస్సుపై సుమారు రూ. 60 కోట్ల అంచనా వ్యయంతో కేబుల్ కార్ మరియు గ్లాస్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని, దీనివల్ల వరంగల్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు పర్యాటకుల కోసం ఫుడ్ స్టాల్స్ మరియు బోటింగ్ సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. భద్రకాళి సరస్సు చుట్టూ జరుగుతున్న మాడ వీధుల నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ ఆధ్యాత్మికత దెబ్బతినకుండా పనులు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కాకతీయ మ్యూజికల్ గార్డెన్ దశాబ్దాలుగా నిరాదరణకు గురైన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సుమారు రూ. 3.5 కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా కొత్తగా మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు, ఆకర్షణీయమైన బటర్ ఫ్లై పార్క్ నిర్మాణం, పిల్లల కోసం అత్యాధునిక ఆట పరికరాలతో కూడిన చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, గార్డెన్ లోపల కొత్తగా లోటస్ పాండ్ (తామర కొలను) మరియు ఔషధ మొక్కల పెంపకం పనులను పరిశీలించారు.




## తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్‌పై కొత్త రూల్స్

**చెన్నూరు ఆర్సీ : జనోదయ**

తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ కఠినమవుతున్నాయి. ఇకపై లైసెన్స్ పొందాలంటే పాత రెండు పరీక్షలతో పాటు మరో అదనపు టెస్ట్ తప్పనిసరి. తెలంగాణ రవాణాశాఖ ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ఇప్పటివరకు ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ టెస్ట్‌లే ఉండగా, ఇకపై ముందుగా ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాతే ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేయాలి. కాగా, ఈ చర్యలతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**హనుమాన్ మాలధారణ స్వాములకు**

## అన్న ప్రసాద వితరణ

**-భక్తిభావం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు - భాగ్యలక్ష్మి దంపతులు -**

**జనోదయ, మందమర్రి మార్చి 22:**



పట్టణంలోని పాల చెట్టు పంచముఖి హనుమాన్ దేవాలయంలో ఆదివారం పట్టణంలోని హనుమాన్ మాలధారణ స్వాములకు మాజీ ప్రభుత్వ విప్ చెన్నూరు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి, మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు నల్లాల ఓదెలు – భాగ్యలక్ష్మి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, పుణ్య ఆశీర్వచనం అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడుతూ, స్వామివారి కృపాకటాక్షాలతో ఆరోగ్యంగా ఉన్నన్ని రోజులు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు. ఈ సందర్భంగా నల్లాల ఓదె లు – భాగ్యలక్ష్మి దంపతులు స్వయంగా స్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు కృష్ణ చైతన్య ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి**

**జనోదయ, మందమర్రి మార్చి 22:**

పట్టణాలలో పర్యావరణం పెంపొందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని మందమర్రి (వి)చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణలో భాగంగా భారత్ అమృత్ స్కీం పథకం కింద 2 కోట్ల 31 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన




ముందడుగు పడిందన్నారు. పట్టణాల్లో పర్యావరణ సౌందర్యాన్ని పెంపొందించడంతోపాటు ప్రజలకు విశ్రాంతి, వినోదం కల్పించే ప్రదేశాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి వలన స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామం, విశ్రాంతి కోసం మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృత పరచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, ప్రజా ఆరోగ్య శాఖ సబ్ డివిజన్ మంచిర్యాల డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ మధుకర్, అసిస్టెంట్ ఇంజనీర్ అనిల్, పర్యావరణ ఇంజనీర్ ఎం గోపి కృష్ణ, డేటా ప్రాసెసింగ్ అధికారి బి శ్యాం బాబు పాల్గొన్నారు.

janodaya జనోదయ



# బాబు గారి సొంత డబ్బా

హైదరాబాద్‌ని అభివృద్ధి చేసింది నేనే అని పదేపదే గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అమరావతిని ఏళ్లు గడుస్తున్నా నిలబెట్టలేకపోతున్నారు.వర్షపు నీళ్ళు తోడటానికే వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ కాలం గడుపుతున్నారు.పదేపదే విజనరీ సీఎం చంద్రబాబు అని భజన చేసే భజన మీడియాలకు చంద్రబాబులో ఏం విజనరీ కన్పించిందో తెలియదు కానీ అమరావతిలో మాత్రం వర్షం నీటిని తోడుతున్న విజనరీ కన్పించకపోవడం విడ్డూరం.



## హైదరాబాద్ అభివృద్ధిపై మళ్లీ ఏపీ సీఎం చంద్రబాబు గొప్పలు

**హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు తీసుకువచ్చా**

**కృష్ణానది నుంచి నీళ్లు తీసుకొచ్చా**

**భారత్‌లో కంపెనీలు పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా**

**ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తెచ్చేందుకు అనేకమందితో చర్చించా**

**హైదరాబాద్‌లో ఐటీ ఆఫీస్ పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా**

ఏపీ సీఎం నారా చంద్రాబు నాయుడు మరోసారి తన స్వంత డబ్బా తనే కొట్టుకున్నారు.అవకాశం దొరికినా దొరకకున్నా...సందర్భం ఉన్నా లేకపోయినా హైదరాబాద్‌ని నేనే అభివృద్ధిని చేశా..సెల్‌ఫోన్‌ని నేనే కనిపెట్టా..మెంథా తుఫాన్‌ని తరిమేశా..కంప్యూటర్‌ని నేనే కనిపెట్టా..కరోనాకి మందుకూడా నేనే కనిపెట్టా అని గతంలో చెప్పి నవ్వులపాలయిన విషయం తెల్సిందే. తాజాగా హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అప్పట్లో ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో హైదరాబాద్ పేరు ఉండేదని వివరించారు. హైదరాబాద్‌కు బిల్ క్లింటన్‌ను తీసుకొచ్చానని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తెచ్చేందుకు అనేకమందితో చర్చించానని అన్నారు. భారత్‌లో కంపెనీలు పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ ఆఫీస్ పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని పేర్కొన్నారు.




ఏపీ సీఎం నారా చంద్రాబు నాయుడు మరోసారి తన స్వంత డబ్బా తనే కొట్టుకున్నారు.అవకాశం దొరికినా దొరకకున్నా...సందర్భం ఉన్నా లేకపోయినా హైదరాబాద్‌ని నేనే అభివృద్ధిని చేశా.. సెల్‌ఫోన్‌ని నేనే కనిపెట్టా..మెంథా తుఫాన్‌ని తరిమేశా..కంప్యూటర్‌ని నేనే కనిపెట్టా..కరోనాకి మందుకూడా నేనే కనిపెట్టా అని గతంలో చెప్పి నవ్వులపాలయిన విషయం తెల్సిందే. తాజాగా హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అప్పట్లో ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో హైదరాబాద్ పేరు ఉండేదని వివరించారు. హైదరాబాద్‌కు బిల్ క్లింటన్‌ను తీసుకొచ్చానని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తెచ్చేందుకు అనేకమందితో చర్చించానని అన్నారు. భారత్‌లో కంపెనీలు పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ ఆఫీస్ పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరానని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఐఎస్‌బీలో సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ నిర్వహించారు. ఏఐ వినియోగం, విస్తరణ లక్ష్యంగా ఈ సదస్సులో చర్చించారు. ఈ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. గతంలో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేదని పేర్కొన్నారు. కేవలం 9 నెలల్లోనే కృష్ణా నది నుంచి తాగునీరు తీసుకొచ్చామని తెలిపారు. హైదరాబాద్‌కు ఐఎస్‌బీ తీసుకు రావడానికి ఎంతో కృషి చేశానని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం 5 వేల ఎకరాలు సేకరించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అయితే గొప్పలు చెప్పుకోవడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి సాటిరాగల వారు మరొకరు ఉండరనేది కాదనలేని సత్యం.చంద్రబాబు చెప్పుకునే గొప్పలకు భజన మీడియా, ఎల్లో పార్టీల మీడియా ఆకాశానికెత్తుతూ అహో..బ్రహ్మాండం..రాజాధిరాజా..రాజా విక్రమార్క అంటూ సదరు మీడియా తాళాలు వేయడం తెల్సిందే.అయితే హైదరాబాద్ నగరం అనేది కొన్ని వందల సంవత్సరాల చరిత్రకల నగరం.కాలక్రమేనంలో అనేక రంగాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందుతూ వస్తోంది.నిజాం పాలకుల నుంచి నేటి రేవంత్ రెడ్డి సర్కార్ వరకు అభివృద్ధి పరంపర నడుస్తోంది.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీతోపాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిందే.వాస్తవానికి హైదరాబాద్ నగరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కూడా రాజధానిగానే ఉంది. అలాంటప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగింపు అనేది సర్వసాధారణ అంశమే.ముఖ్యమంత్రులుగా ఎల్లయ్య ఉన్నా పుల్లయ్య ఉన్నా అభివృద్ధి కార్యక్రమాల కొనసాగింపు జరగాల్సిందే.మరి అలాంటప్పుడు పదేపదే హైదరాబాద్‌ని అభివృద్ధి నేనే చేశా అని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడంలో అర్థమే లేదు.వాస్తవానికి చంద్రబాబు అనంతర కాలమే హైదరాబాద్ గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతోంది.హైటెక్ సిటీకి మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి పురుడుపోయగా చంద్రబాబు కాలంలో పూర్తయింది.అయితే హైటెక్ సిటీ అభివృద్ధి వెనక రియల్ ఎస్టేట్ దందా నడిపినట్లుగా ఆరోపణలున్నాయి. అదేవిధంగా మెట్రో రైలు,ఔటర్ రింగు రోడ్డు విషయంలో కూడా చంద్రబాబు పాత్ర ఉన్నదన్నది అవాస్తమే. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనా కాలంలోనే శంశాబాద్ ఎయిర్‌పోర్టు,ఔటర్‌రింగు రోడ్డు పనులు,మెట్రో రైలు మార్గాలకు చర్యలు తీసుకున్నారు.తర్వాత కాలంలో కేసీఆర్ హయాంలో ఈ అభివృద్ధి పనులు కొన్ని పూర్తయిన విషయం తెల్సిందే.ఇక హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పాలనా కాలంలోనే ఎక్కువ ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంతో పాటు తెలంగాణకే తలమానికంగా ఉన్న సచివాల నిర్మాణంతో పాటు అనేక కట్టడాలు పూర్తయ్యాయి.ఇక తెలంగాణ రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు,తాగు నీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనాకాలంతోపాటు బీఆర్ఎస్ పాలనా కాలంలోనే గణనీయంగా నిర్మింబడ్డాయి.పైగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరువు రాజ్యమేలేది.విద్యుత్ కట్‌కటలు ఉండేవి. వాస్తవానికి చంద్రబాబు పాలనాకాలంలో ఆయనకు గొప్ప పేరు తీసుకొచ్చిన ఒక్క పథకం కాని ప్రాజెక్టుకాని లేదని చెప్పడానికి సంకోచం అక్కర్లేదు.అందుకేనేమో పదేపదే హైదరాబాద్‌లో అభివృద్ధి నేనే చేశా..బిల్‌క్లింటన్‌ని నేనే రప్పించా వంటి ఊకదంపుడు ప్రసంగాలతోనే చంద్రబాబు రాజకీయం ముగిసేలా ఉంది.సరే హైదరాబాద్‌ని చంద్రబాబు మాత్రమే గొప్పగా అభివృద్ధి చేశారనుకుందాం.మరి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయినప్పుడు మొదట ముఖ్యమంత్రిగా అశకాశం ఇచ్చింది చంద్రబాబుకే కదా? మరి ఆ ఐదేండ్లు చంద్రబాబు ఏం చేశారు? కేవలం గ్రాఫిక్స్‌లో అదిగో అమరావతి..ఇదిగో సింగపూర్ అంటూ ప్రజలన్ని ఐదేండ్ల పాటు బ్రమల్లో ఉంచి తీరా ఎన్నికల్లో దారుణంగా ఓటమి చెందిన విషయం తెల్సిందే.అనంతరం వైఎస్ జగన్ పరిపాలనా కాలంలో అరాజకం నడిచిందంటూ చేసిన ప్రచారాన్ని నమ్మటమో లేక కూటమితో చంద్రబాబు మళ్ళీ సీఎం కాగలిగారు.అయితే ఇప్పుడు చంద్రబాబు భారీ మెజార్టీతో ముఖ్యమంత్రి పదవిని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో దారుణంగా విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా ఉన్నాయి.ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే ఇప్పటికిప్పుడు ఏపీలో ఎన్నికలు జరిగితే చంద్రబాబు నాయుడుకి దారుణ ఓటమతి తప్పదనే పరస్థితి క్షేత్రస్థాయిలో ఉంది. అమరావతి నిర్మాణం వర్షపు నీళ్ళు తోడటంతోనే కాలం గడిచేలా ఉంది.ఎక్కడి నిర్మాణం అక్కడే అన్న చందంగా అమరావతి పరిస్థితి ఉంది.మరి హైదరాబాద్‌ని అభివృద్ధి చేసింది నేనే అని పదేపదే గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అమరావతిని ఏళ్లు గడుస్తున్నా నిలబెట్టలేకపోతున్నారు.వర్షపు నీళ్ళు తోడటానికే వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ కాలం గడుపుతున్నారు.పదేపదే విజనరీ సీఎం చంద్రబాబు అని భజన చేసే భజన మీడియాలకు చంద్రబాబులో ఏం విజనరీ కన్పించిందో తెలియదు కానీ అమరావతిలో మాత్రం వర్షం నీటిని తోడుతున్న విజనరీ కన్పించకపోవడం విడ్డూరం.అయితే హైదరాబాద్‌ని నేనే అభివృద్ధి చేశా అని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటుంటే ఆ గొప్పలని ఔను నిజమే అని భజన చేసే కొందరు నేతలు ఉండటం దౌర్భాగ్యం.హైదరాబాద్ అనేది ఓ గొప్ప చారిత్రక నగరం.ఎవరున్నా లేకున్నా..కాలానుగుణంగా హైదరాబాద్ మహానగరం అభివృద్ధిలో మార్పులు జరగాల్సిందే.అది ఎవరి గొప్పతనమో అని చెప్పడం..చెప్పుకోవడం రాజకీయ వైకల్యమే.ఈ విషయాన్ని మరచిన చంద్రబాబు పదే పదే హైదరాబాద్ నిర్మాత నేనే..శిల్పిని నేనే అని చెప్పుకోవడం మానసిక రుగ్మతేకాక రాజకీయ వైకల్యమే అవతుంది.మరి చంద్రబాబు ఈ విషయాన్ని ఇప్పటికైనా గమనంలోకి తీసుకుని హైదరాబాద్ సంగతి మరచి అమరావతి నిర్మాణం మీద దృష్టి నిలపాల్సిన అవసరం ఉంది.

......................

మానసాని కృష్ణారెడ్డి
9618616110

# పైరవీలకు పరిమితమైన ఎఐటియుసి

**-ఎఐటియుసి విమర్శలు సిగ్గుచేటు-**

**జనోదయ, మందమర్రి మార్చి 22:**

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటి యుసి కార్మిక సమస్యలు పరిష్కరించడం మరిచి, సమస్యలపై పోరాటం చేయలేక, కాంగ్రెస్ పార్టీని, ఐఎన్టియుసి యూనియన్ ని విమర్శించడం సిగ్గుచేటని సింగరేణి కోల్ మెన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టియుసి) కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యలు అన్నారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు దాటిన, గెలిచిన ఎర్ర జెండా సంఘమైన ఏఐటియుసి కార్మికుల డిమాండ్లను నెరవేర్చలేదని, ఉపయోగకర ఒప్పందం ఏ ఒక్కటి చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచి యాజమాన్యంతో స్ట్రక్చరల్ సమావేశంలో సమస్యలపై చర్చలు జరపకుండా, సమస్యలపై యాజమాన్యాన్ని నిలదీయకుండా, సమావేశాలు బహిష్కరించి నేడు కార్మికుల వద్దకు వచ్చి, సమావేశంలో పాల్గొనలేదంటూ,కార్మికులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై, ఐఎన్టియుసిలపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ, నిందలు వేయడం శోచనీయమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పొత్తుతో గెలిచిన సిపిఐ ఏకైక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిత్యం సింగరేణి, సిఎండి కార్యాలయాలలోనే ఉంటూ, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ల చుట్టు ప్రదక్షిణలు చేస్తూ, పైరవీలకే పరిమితమై, కార్మికుల హక్కులను మరిచి, నేడు కాంగ్రెస్ పైన విమర్శలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణిని దోచుకుంటున్న ఏనాడు సిపిఐ నేతలు ప్రశ్నించకుండా, నేడు సింగరేణి పరిరక్షణకు పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ఐఎన్టియుసి కృషితో కాంగ్రెస్ పార్టీ సింగరేణిలో డిపెండెంట్‌ల వయస్సు 40 సంవత్సరాలకు పెంచడం జరిగిందని నైనీ బొగ్గు బ్లాక్ నుండి బొగ్గు ఉత్పత్తికి సిద్ధం చేయడం జరిగిందని గుర్తు చేశారు. గుర్తింపు సంఘం ఓడినా, ఐఎన్టియుసి నిత్యం కార్మికుల పక్షాన ఉంటూ, కార్మిక సమస్యల



పరిష్కారానికి పోరాడుతుందని స్పష్టం చేశారు. గత ఎనిమిది నెలలుగా సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోతే యాజమాన్యాన్ని నిలదీయకుండా, పోరాటాలు చేయకుండా, కాంగ్రెస్, ఐఎన్టీయూసీ లను విమర్శించడం సరికాదన్నారు. ఏఐటియుసి నాయకులు తమ వైఫల్యాన్ని అంగీకరిస్తే ఐఎన్టియుసి కార్మికుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడుతుందన్నారు. తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో టీబీజీకేఎస్ సింగరేణిలో ఎన్నికలు నిర్వహించకుండా గుర్తింపుకు సంఘంగా కొనసాగగా, నేడు ఏఐటియుసి సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా అనైతిక పొత్తుతో గెలిచి, డిసెంబర్ 23 నాటికి రెండు సంవత్సరాల కాలపరిమితి పూర్తయిన, తాము ధృవీకరణ పత్రం ఆలస్యంగా తీసుకున్నామని, యాజమాన్యానికి తొత్తుగా మారి, కార్మికులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఏఐటియుసి హయాంలో కార్మిక హక్కులు సాధించినవి శూన్యమని ఎద్దేవా చేశారు. ఏరియాలో క్వార్టర్ ల కేటా యింపులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్మికులు విధులు నిర్వహించేందుకు సరైన పనిముట్లు లేవని, కార్మికు లపై పనిభారం మోపుతున్న ప్రశ్నించే నాధుడే లేదని ఆరోపించారు. గుర్తింపు సం ఘం నాయకులు యాజమాన్యానికి కొమ్ము కాస్తూ పైరవీలకే పరిమితమయ్యారని, కార్మికుల సమస్యలను గాలికి వదిలేసారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వై సత్యనారాయణ, కేంద్ర కార్యదర్శి ఆర్ శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి పి ఓదేలు, నాయకులు బి సదయ్య, కే తిరుపతి, ఎన్ సాంబయ్య, పైడిపల్లి శ్రీకాంత్, కే బాబు, కొమురయ్య, రాములు, కిషోర్ లు పాల్గొన్నారు.